క్లుప్తంగా

ఆత్మీయ కలయిక



తాడేపల్లిలో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన నౌడు వెంకటరమణ

నిడమర్రు: తాడేపల్లి వైఎస్సార్ కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం రాష్ట్ర మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ బీసీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ కలిసారు. ఈ సందర్భంగా ముందుగా జగన్‌కు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర బీసీ కేడర్‌ను ఐక్యం చేయడంతోపాటు పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు నౌడు రమణ తెలిపారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



గోపినాథపట్నం ఆంజనేయస్వామి సన్నిధిలో మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు

ఉంగుటూరు: జిల్లాలోనే పేరుగాంచిన గోపినాథపట్నం ఆంజనేయస్వామి ముక్కోటి సందర్భంగా పూజలను మాజీ మంత్రి, ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొట్టు సత్యనారాయణ దంపతులు ప్రారంభించారు. బుధవారం కలశ స్థాపన తదితర కార్యక్రమాలు కొట్టు సత్యనారాయణ నిర్వహించారు. పుణ్యనదుల జలాలతో ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అన్ని రకాల ఫలములతో సహస్రనామ పూజలు చేశారు. వేద పండితులు సుందరకాండ, భగవద్గీత, హనుమాన్ ఛాలీసా పారాయణం చేశారు. నవగ్రహ పూజలు, సూర్యనమస్కారాలు, విశేష పూజలు నిర్వహించారు.


విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌ల వితరణ



ఎస్ఎంసీ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను బహూకరిస్తున్న అమెరికా దేశస్తులు

పెదవేగి : విద్యార్థులకు విదేశీయులు స్కూల్ బ్యాగ్‌లను బహూకరించారు. పెదవేగిలోని ఎస్ఎంసీ పాఠశాల్లో బుధవారం అమెరికాకు చెందిన జిమ్, కార్ల, ఎమిలీ, కరెన్, లారీ, హోల్లీ, సబ్రినా, పాట్రిక్ 1,200 విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, స్పోర్ట్స్ డ్రెస్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా వారంతా చిన్నారులతో కాసేపు ముచ్చటించి, సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ సంస్థ చైర్మన్ చుక్కా డొమ్నిక్, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ చుక్కా అవినాష్‌రాజ్ పాల్గొని దాతలను అభినందించారు.

విద్యార్థి చదువుకు ఆర్థిక సాయం



ఇంజనీరింగ్ విద్యార్థి సుధాకర్‌కు రూ.50 వేల చెక్కు అందిస్తున్న లయన్ ఈపూరి

నిడమర్రు: బువ్వనపల్లిలో పూర్వపు జిల్లా గవర్నర్ లైన్ ఈపూరి సత్యనారాయణ నివాసంలో బుధవారం గణపవరం లయన్స్ క్లబ్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బావాయిపాలెంకు చెందిన ఎన్.సుధాకర్‌కు కళాశాల ఫీజు నిమిత్తం రూ.50 వేలు నగదు చెక్కును ఆర్థిక ప్రోత్సాహంగా ఈపూరి సత్యనారాయణ అందించారు. సుధాకర్ పంజాబ్ రాష్ట్రం లవ్లీ యూనివర్సిటీలో మైక్రోసాఫ్ట్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నట్లు లయన్స్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆ క్లబ్ అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు, సభ్యులు విశారద, కిలారి రవి తదితరులున్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యురాలు గుడిమెట్ల అచ్యుత, సత్యదేవ్ దంపతులు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమతున్న యువత కోసం రూ. 30 వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయ ప్రతినిధులకు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్‌బాబు మాట్లాడుతూ దాతల ఔన్నత్యాన్ని ప్రశంసించారు. గ్రూప్ పరీక్షలకు, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అభ్యర్థులకు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినియోగం చేసుకుని అభ్యర్థులు మంచి ఉద్యోగాలు సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. వ్యక్తం చేశారు. ఏవీ రత్నం, కే. ఉష పాల్గొన్నారు.

అలంకారప్రాయంగా మంచినీటి పథకం

- నాచుగుంటలో రూ.6.70 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం
- గ్రామాలకు చేరని తాగునీరు.. ప్రజలకు తీరని దాహార్తి
- నిర్వహణ అంతంత మాత్రమే



పనిచేయని ఫిల్టరు బెడ్లు



నాచుగుంట ధర్మ చెరువు

ఉంగుటూరు: మంచినీటి సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశ్యంతో 2009లో ఉంగుటూరు మండలంలోని నాచుగుంటలో భారీ ప్రాజెక్టుగా నిర్మించిన మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్) స్కీమ్ ప్రజల దాహార్తిని తీర్చలేకపోతోంది. భూమి నైసర్గిక స్వరూపాన్ని అనుసరించి మంచినీటి ట్యాంకు నిర్మించకపోవడంతోపాటు అనేక సాంకేతిక కారణాలతో నాచుగుంట సామూహిక ప్రజల సీపీడబ్ల్యూఎస్ స్కీము అక్కరకు రావడం లేదు. ఫలితంగా పలు గ్రామాల ప్రజలకు తాగు నీరు ఈ ప్రాజెక్టు ద్వారా అందించ లేకపోతున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మితమైనప్పటి నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతోంది. బాదంపూడి, వెల్లమిల్లి, నాచుగుంట, నీలాద్రిపురం పంచాయతీ పరిధిలో ఉన్న 12 గ్రామాల ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు 2009లో ఉంగుటూరు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే దివంగత వట్టి వసంతకుమార్ ఈ వాటర్ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.6.70 కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఈ ప్రాజెక్టు కోసం పంచాయతీకి రూ. లక్షల ఆదాయం వచ్చే చెరువును రిజర్వాయరు నిర్మాణం కోసం గ్రామ పంచాయతీ కేటాయించింది. ప్రాజెక్టు పనుల్లో భాగంగా రాతి రివిట్‌మెంటు, ట్యాంకు నిర్మాణం, గోదావరి కాలువ వద్ద పంపింగ్, కాలవు వద్ద నుంచి రిజర్వాయరు వరకు పైపులైన్ నిర్మాణం, గ్రామాలకు పైపులైన్ నిర్మించారు. పనులన్నీ పూర్తయిన అనంతరం కొన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేశారు, కొన్ని గ్రామాలకు నీరు చేరలేదు. దాంతో ఈ ప్రాజెక్టుపై ఆశలు పెట్టుకోవడం పలు గ్రామాల ప్రజలకు నిరాశే మిగిలింది. దీంతో ఆయా గ్రామ పంచాయతీలు స్థానికంగా నిర్మించుకున్న రక్షిత మంచినీటి ట్యాంకులకు అక్కడ వేసిన బోర్ల నీటిని ఎక్కించుకుని పైపులైన్ ద్వారా ఇంటింటికీ నీరు సరఫరా చేస్తున్నారు. దీంతో నాచుగుంట ప్రాజెక్టు నిర్మాణ లక్ష్యం నెరవేరలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఈ ప్రాజెక్టు విషయంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

ఏటా నిర్వహణ వ్యయం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షలు

వాస్తవానికి గోదావరి నీరు నాచుగుంట రిజర్వాయర్ నుంచి ఆయా గ్రామాలకు పైపుల ద్వారా చేరి ఆయా గ్రామాల్లోని ట్యాంకులకు చేరాల్సి ఉంది. అక్కడి నుంచి గ్రామంలోని అన్ని వీధులకు మంచినీరు చేరాలన్న ఉద్దేశ్యంతో నాచుగుంట ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు వద్ద ఆపరేటర్‌కు జీతాలు సరిగా ఇవ్వడం లేదు. ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల నిధులు ఏటా కేటాయిస్తున్నారు. ఆ నిధులు ఏమవుతున్నాయో ఎవరికీ తెలియని పరిస్థితి నెలకొంది. అధికారుల పర్యవేక్షణ ఈ ప్రాజెక్టుకు కరువైంది. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నుంచి ఒక్కోసారి నాచుగుంట, కొత్తగూడెం, పాటిమీద గ్రామాలకు మాత్రమే చేరుతుంది. మిగిలిన యర్రమళ్ల, గుళ్లపాడు, చిన్న వెల్లమిల్లి, చింతాయిగూడెం, పెద వెల్లమిల్లి, బాదంపూడి గ్రామాలకు నీరు చేరడం లేదు. దాంతో ఆయా గ్రామాల ప్రజలకు సురక్షితమైన తాగునీరు దొరకటం కష్టంగా మారింది.

కొన్ని గ్రామాలకు నీరు చేరడం లేదు



ఈ ప్రాజెక్టు పరిధిలోని గుళ్లపాడు, చింతాయిగూడెం, చిన్న వెల్లమిల్లికి నీరుచేరని మాట వాస్తవమేనని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు తెలిపారు. రిజర్వాయర్ దగ్గర ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్చి, బ్లీచింగ్ కలపాల్సి ఉంది. త్వరలోనే మార్పు చేస్తాం. యర్రమళ్లకు నీరు వెళ్లడానికి ఏర్పడిన సమస్య త్వరలోనే పరిష్కరిస్తాం.

– రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఈ

జీతాలు రావడంలేదు



ప్రాజెక్టు ద్వారా నీరు పూర్తిస్థాయిలో సరఫరా కావడం లేదు. ప్రాజెక్టు వద్ద పని చేస్తున్న వారికి సక్రమంగా జీతం రావడంలేదు. ఒక్కోసారి నీరు బాగానే వెళుతోంది. అన్ని గ్రామాలకు నీరు చేరడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. కారణం కనుగొనేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

– గొన్నూరి వెంకటేశ్వరరావు, ప్రాజెక్టు మోటార్ ఆపరేటర్

ఆశయం నెరవేరలేదు



నాలుగు పంచాయతీల్లో 12 గ్రామాల ప్రజల దాహార్తి తీర్చాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మించారు. 2009 నుంచి 2014 వరకు ఈ ప్రాజెక్టు నిర్మించారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవం కూడా చేయలేదు. పర్యవేక్షణలోపం వల్ల ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. నీరు సమగ్రంగా సరఫరా కావడం లేదు.

– చిట్టూరి హరిబాబు, వైస్ ఎంపీపీ, నాచుగుంట

మంచినీరు సరఫరా లేదు



మంచినీరు నాచుగుంట దళిత వాడకు రావడం లేదు. స్థానికంగా బోరు ద్వారానే నీరు వస్తోంది. ప్రాజెక్టు నిర్మాణం దగ్గర నుంచి ఇదే పరిస్థితి. మిగిలిన గ్రామాలకు నీరు చేరడంలేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కొరపాటి పెద్దిరాజు, నాచుగుంట

పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి

దెందులూరు: రైతులందరూ పాడి పశువులు దొమ్మ వ్యాధి, గాలి కుంటి వ్యాధి బారిన పడకుండా పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అందించే ఉచిత టీకాలను పశువులకు తప్పనిసరిగా రైతులు వాటికి టీకాలను వేయించాలని దెందులూరు మండలం పశువైద్య శాఖ అధికారి డాక్టర్ కే. రామ్మోహనరావు అన్నారు. బుధవారం కొవ్వలి పశువైద్య శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చలి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పశువులను పాకలోనే ఉంచాలన్నారు. పశువులను పొడి ప్రదేశంలో ఉంచాలని సూచించారు. పశువుల దూడలకు మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని డాక్టర్ కె రామ్మోహనరావు సూచించారు.

లూయిస్ బ్రెయిలీ మార్గదర్శకుడు

దెందులూరు: లూయిస్ బ్రెయిలీ అంధుల జీవితాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపి వారికి జీవితం పట్ల భరోసాన్ని కలుగజేసిన గొప్ప మహనీయుడని కొవ్వలి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ఎల్ఎస్‌జీ శర్మ అన్నారు. బుధవారం కొవ్వలి భవిత పాఠశాలలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు నిర్వహించారు. చిన్నారులతో కేక్ కట్ చేయించారు. లూయిస్ బ్రెయిలీ జీవిత విశేషాలను చిన్నారులకు హెచ్ఎం శర్మ వివరించారు. కార్యక్రమంలో సుధారాణి, విజయకుమారి, శ్రీదేవి, హేమలత, రాములు ఉన్నారు.

బ్యాంకుల సేవలు ఆదర్శనీయం

ఉంగుటూరు: సమాజ సేవలో బ్యాంకులు భాగస్వామ్యం కావడం ఆదర్శనీయమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలం నారాయణపురంలో స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కొబ్బరి తోట వద్ద ఉన్న పాఠశాలకు రూ.5 లక్షలు విలువైన కంప్యూటర్లు, విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ ఎస్‌బీఐ మేనేజరు కృష్ణ చైతన్యను, సిబ్బందిని అభినందించారు. సర్పంచి దిడ్ల అలకానంద అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికార్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి



భీమడోలులోని జాతీయ రహదారిపై పొగమంచులో వెళ్తున్న ఆర్టీసీ బస్సు

భీమడోలు: కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత్తలు గణనీయంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం 9 గంటలకు కూడా పొగమంచు వీడడం లేదు. దీనితో వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకే చలి పులి విజృభిస్తోంది. దీనితో రైతులు, వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యం బారిన పడిన వారంతా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పొగమంచుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఆస్తమా, కోరింత దగ్గు, చర్మ వ్యాధులు, జలుబు, వాటి రోగాలు చుట్టుముడుతున్నాయి. వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార నియమాలను పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. చలి తీవ్రత వల్ల అనవసరంగా బయటకు రావద్దని, వైరస్‌లు సోకే ప్రమాదం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.



పొలాలను కమ్మేసిన మంచు

వారధి నిర్మాణ పనులు చేపట్టరా?



గుండుగొలను వద్ద నిలిచిన వంతెన నిర్మాణ పనులు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో నెలరోజులుగా వంతెన నిర్మాణ చివరి దశ పనులు జరగడం లేదు. జనవరి నెల రెండవ వారం నాటికి వంతెన పనులు పూర్తి చేస్తామని ప్రకటించిన సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారు. దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కీలక ఘట్టమైన వంతెన వద్ద ఫిల్లర్లపై గడ్డర్లను బిగించారు. ఆ తర్వాత సెంట్రింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా వివిధ కారణాలను సాకుగా చూపుతూ ఆపనులు నిలిపి వేసారు. దీనితో వంతెన నిర్మాణ పనులు ఎక్కడి గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. ఈ వంతెన నిర్మాణం ఏడాదిన్నర కాలంగా నుంచి సాగుతుంది. ఈనెల రెండో వారంలో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు సెంట్రింగ్ పనులు చేయకపోవడంతో వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందోనన్న అనుమానం వ్యక్తమవుతుంది. దీనితో ఈ వంతెన నుంచి రాకపోకలు సాగించే 15 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

పోషక వాటికలతో తల్లీబిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



సూరప్పగూడెంలో ఎండీఎం భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా పీడీ పి.శారద

భీమడోలు: అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఆకుకూరలు, కూరగాయాలు పండించి వాటినే చిన్నారులకు ఆహారంగా అందించాలని ఐసీడీఎస్ ఏలూరు జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. భీమడోలు ప్రాజెక్టు గుడాన్, సూరప్పగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసారు. కార్యాలయంలోని మెడికల్ కిట్లను వెంటనే సమావేశాలను నిర్వహించి కేంద్రాలకు తరలించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సూరప్పగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 1, 2ను ఆమె తనిఖీ చేసారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. ఎండీఎం ఆహార పదార్థాల నాణ్యతను చూసారు. కేంద్రాల్లోని పోషణ వాటికలో భాగంగా పండించిన ఆకుకూరలు, కూరగాయాలను ఆమె పరిశీలించారు. పోషణ వాటిక గార్డెన్స్‌లో సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. ప్రీస్కూలు విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. పోషక వాటిక గార్డెన్లను అంగన్‌వాడీ సిబ్బంది సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి పీవో ఎండీ షాహనాజ్‌బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు రాజమణి, కల్పన పాల్గొన్నారు.

నేడు దెందులూరులో నగర సంకీర్తన

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని దెందులూరులో గురువారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన నిర్వహిస్తామని రామదండు మండల కమిటీ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.05 గంటలకు విష్ణు ఆలయంలో ఉత్తర ద్వారదర్శనం కల్పిస్తామని, భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: మండలం పరిధిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల దృష్టికి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్‌కార్యాలయంలో ఆమె మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలపై గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో బాధితులు అర్జీలు అందజేశారన్నారు. ఉన్నతాధికారుల సూచనలు సలహాలు నిబంధనలకు అనుకూలంగా డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మండల సర్వేయర్, గ్రామాల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏల సహాయ సహకారాలతో పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి



సబ్ డివిజన్ స్థాయిలో సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ పి.ఉషారాజకుమారి

భీమడోలు: రైతులు పంటల బీమా పథకం ప్రీమియంను విధిగా చెల్లించాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలు రైతు భరోసా కేంద్రం 3 వద్ద బుధవారం సాయంత్రం భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని వ్యవసాయ గ్రామ సహాయకులు, ఉద్యానవన గ్రామ సహాయకులకు కెపాసిటీ బిల్డింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, పథకాల అమలు, ఈ పంట, పంటల బీమా తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ పంటల బీమా పథకం ప్రీమియంను ఈనెల 15వ తేదీలోగా ప్రతి రైతు చెల్లించాలని, వరి ఎకరాకు రూ.500, మినుముకు రూ.60 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. దాళ్వా సాగు ప్రారంభం కావడంతో రైతులు పండించే పంట వివరాలను ఈ పంటలో నమోదు కార్యక్రమం చేపట్టి, రైతుల నుంచి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతులకు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. ఎరువులు, పురుగుల మందులను అధికంగా వాడి పెట్టుబడి పెంచుకోవద్దని సూచించారు. ఏవోలు ఎస్‌పీవీ ఉషారాణి, ప్రవీణ్, దుర్గా రమేష్, గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో హరిదాసుల వేషధారణలో చిన్నారులు

ఉంగుటూరు: సంక్రాంతి సంబరాలు స్థానిక డాక్టర్ సుంకవల్లి విజ్ఞాన భారతి పాఠశాలలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులు రకరకాల వేషధారణలతో సంక్రాంతి ముందే వచ్చిందన చందంగా కనిపించారు. కరస్పాండెంటు పాతూరి వంశీ దంపతులు పిల్లలకు భోగిపండ్లు వేశారు. విద్యార్థులు కొత్త దుస్తులు ధరించి సందడి చేశారు. ఈసందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలతో చిన్నారులు ఆకట్టుకున్నారు.

భక్తిశ్రద్ధలతో హారతి పాశురం



హారతి పాశురంలో పాల్గొన్న భక్తులు



చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం తిరుప్పావై పాశుర విన్నపాల్లో భాగంగా గోదాదేవి శ్రీ వారికి సమర్పించిన మంగళ హారతి దినోత్సవాన్ని పురస్కరించుకుని హారతి పాశురం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష హారతులు సమర్పించారు. ఉదయం స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ శ్రీమద్విరాట పర్వం అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 7.30 గంటల నుంచి కోనేటి యిన సోహిత సుబ్బలక్ష్మి నృత్య ప్రదర్శన, అనంతరం రాత్రి 8 గంటల నుంచి నగరానికి చెందిన మేదరమెట్ల శిరీష శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



కంసాలిగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ఉంగుటూరు : ఆరోగ్య నియమాలు పాటించి అందరూ ఆరోగ్యంగా ఉండాలని మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంటు ఉద్యోగులు కోరారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గొల్లగూడెం, కంసాలిగుంట, ఎ.గోకవరంలో ప్రజలను చైతన్య పరిచే కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం సబ్‌యూనిట్ అధికారి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయా గ్రామాలు వైద్య సిబ్బంది వెంకటస్వామి, సంధ్య, సుశీల కపారత్నం, కుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ఉంగుటూరు: కొత్తగూడెంలో పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు,పెన్సిళ్లు, పెన్నులు బుధవారం పంపిణీ చేశారు. భోజనంలో స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత పాస్టరు విజయకుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.